యిదేనెక్క. ఒకపనిసేస్తే నాయుడేటంటాడో, కరణంవేటంటాడో బారికేటంటాడోకాదు మంచిపనా, సెడ్డపనా? మంచిదయితే సేసెయ్, దేవుడుకాదు, దేవుణ్ణిపుట్టించిన జేజెమ్మైనా దెబ్బలాడు. అదీ మన పద్ధతి. పదండి పదండి ఒక్కనుకేన తీస్తేకాని, రేపు తెల్లారి పన్లోకెల్లలేం. పదండి'' అంటూ ఒక్కొక్కళ్ళనే కదిలించుకుపోతున్నాడు.

వాళ్లు పది పదిహేను బారలు వెళ్లేసరికి గొంతుల వినికిడేకాని మంచులో మనుషులు కనిపించరు.

చితిమీదికెక్కించిన శవం కాలకపోతుందా? అయినా అది విధాయకం, కాబట్టీ— దానితో వాళ్ళ అనుబంధాలు అంతకన్నా దగ్గరవి కాబట్టీ పెద్దలు కొసవరకూ దానిని వదిలిపెట్టలేరు— తెల్లవార్లూ స్మశానంలోనే వుండి తెలతెల్లవారుతుంటే యిళ్ళకొచ్చేరు.

ముసిల్ది నిన్నపోయింది. మనిషి నిన్నపోతే యివాల్టికి రెండు, కాని సంధి కాలంలో అలా అనిపించదు నిన్నానేడూ అంతా ఒక్కలాగే వుంటుంది. ముసలాళ్ళ పని అలాగే వుంది.

# ఏకరువు

— యస్. యస్. ప్రకాశరావు.

రావుగాడు నా పీకల మీదికి గొప్పగా తయారయేడు. నేను సాహితీరంగ ప్రవేశంచేసి పదేళ్ళే అయింది. కాని (ఈ స్వల్పకాలంలోనే) నేను యిప్పటికి ఇరవై మూడు నవలలూ, ఐదొందల నలభైరెండు కథలూ, పదహారు నాటకాలూ రాసేను. రావుగాడుకూడా యించుమించు యీ పదేళ్లాయి రాస్తున్నా, వాడిప్పటికి ఒక్క నవలా రాయలేదు. కథలు మాత్రం ఓ ముప్పయి రాసుంటాడు. అందుకని, వాడికి నేనంటే చెడ్డ జెలసీ

అవును. నా అదృష్టం బావుంది; కాబట్టి నేనేదిరాసినా అచ్చవుతూనే వుంది, వాణ్ణెవడు రాసుకోవద్దన్నాడూ? వాడి చేతకాని తనానికి నామీద ఆడిపోసుకోడం దేనికీ?

556

సాహిత్యానికి ప్రయోజనం వుండాలి- అంటాడు రావు. అవున్నేనుమాత్రం కాదన్నానా? సాహిత్యం పాఠకుడికి సంతోషాన్ని కలిగించాలి; గిలిగింతలు పెట్టాలి; అయ్యో! అనిపించాలి; ఒక మనోహరమైన లోకంలోకి తీసుకు పోవాలి— ఇవన్నీ నాకూ వున్నాయి. కాని రావుగాడు మాత్రం వుడుకుమోత్తనంకొద్దీ, సాహిత్యంగురించి నాకున్న భావాలన్నీ సరైనవి కావు అంటూ వుంటాడు. ఇంతకీ రావుగాడికి సాహిత్యాన్ని గురించిన వుద్దేశాలు ఏంవిటో తెలుసా? సాహిత్యం జీవితానుభవాన్నికాచి, వడబొయ్యాలిట. (ఈ కాచడం ఏంవింటో, వడబొయ్యడం ఏంవిటో నాకు అర్థంకాలేదు. అమాటే వాడితో అంటే. అది నాకూ, 'నాలాంటి'వాళ్ళకీ చచ్చినా అర్థంకాదన్నాడు. చూసేరా, ఎలా తప్పించుకున్నాడో?) సరే, సాహిత్యం జీవితాన్ని విమర్శించాలి-అనేవాడు. లోకంలో జరుగుతున్న అన్యాయాల్ని బట్టబయలు చెయ్యాలి— అనేవాడు.

అయితే, వాడలా పేల్తోవుంటే నేను వూరుకోలేదు. అప్పుడప్పుడు గట్టిగా తగులుకునీవాణ్ని.

లోకంలో ఏవోకొన్ని అన్యాయాలు జరుగుతున్నాయి— అని మీరూ, నేనూ అంతా వొప్పుకుంటాం. అసలు గట్టిగా చెప్పాలంటే పూర్వం వేదకాలంలో కూడా అన్యాయాలు జరిగీవిట. మరంచేత, అన్యాయాలు జరగనిదెప్పుడూ? అయినా ఇది కలికాలం కదా! కలి తన మహత్యం చూపిస్తూనే వుంటాడుకదా! ఇహనిప్పుడు యీ రావుగాడూ, 'వీడిలాంటి'వాళ్ళూ బయల్దేరి అన్యాయ్యాల్ని చీల్చి చెండాడితే మాత్రం కలి మహత్యం ఆపగలరా ఏంవిఁటీ— వీళ్ళమొహం!

కాకపోయినా; ప్రజలందరికీ అన్యాయాలు జరుగుతున్నట్లు తెలుసు. అలాగని వాళ్ళంతా ఆత్మహత్యలు చేసేసుకుంటున్నారా? ఏదో కలో గంజో తాగి, బతికి బట్టకడుతున్నారా, లేదా? అలాంటప్పుడు అసలే బాధల్లోమునిగి తేల్తున్న వాళ్ళకి మళ్ళీ వాళ్ళ బాధలు, కష్టాలు, వీటిగురించే కథలు చదవండంవల్ల ప్రయోజనం ఏంవింటుంది? హాయిగా— ప్రకృతిశోభ; స్త్రీసౌందర్యం; ప్రేమా; ఆత్మవికాసం—వీటినిగురించి రాస్తే, పాపం వాళ్లు అది చదువుకునీ కొంచెం సేపైనా, వాళ్ళ కష్టాల్ని మర్చిపోగలుగుతారు. నేను ఇదే రావుగాడితో చెబితే,—

'ఒరే! ఇలాంటి సాహిత్యం సృష్టించి ప్రజలకి మీరెంతహాని చేస్తున్నారో కూడా మీకు తెలియదురా!.... బాధలు పడుతున్నవాళ్ళని జో కొట్టడం వల్ల, నువ్వు సాయం చేస్తున్నది బాధలు పెట్టేవాళ్ళకి తప్ప మరొకళ్ళకి కాదురా!'అన్నాడు వాడు.

557

అయ్యా! నాకు తెలీకడుగుతాను ఏవిఁటండీ మా రచనలవల్ల కలిగేహాని? వే....ధ్ధవాడికేదో తెలిసినట్టు చెప్తాడు! పాఠకులేవఁన్నా గొఱ్ఱెవెధవలా, (పద ప్రయోగానికి క్షమించాలి) రచయిత లేదిచెప్తే అది వినడానికి? వాళ్ళకి నా రచనలు నచ్చేయి గనక నా నవలలు మూడో ముద్రణకికూడా వెళ్తున్నాయి. పాఠకులకి తెలీదూ, వాళ్ళకేం కావాలో? మరిలాంటప్పుడు, వాళ్ళకి కావల్సిందేదో నేనూ, 'నాలాంటి వాళ్ళూ' రాస్తున్నాం. అదివాళ్లు అభిమానిస్తున్నారు. మధ్య ఈ రావుగాడికెందుకూ ఏడుపు?

రావుగాడికి నామీద ఎంత కసీ, కార్పణ్యం వున్నాయో చెప్పడానికి మచ్చుకి ఒక్క వుదాహరణ చాలు. వాడోసారి నాతో, 'ఒరే, నీకు తెలిసిన విషయాలగురించి రాయడం మానీసి, తెలీని వాటిగురించి ఎందుకురా రాస్తావూ?'అన్నాడు.

అమ్మ నాయినా! కడుపులో ఎంతవిషం వుందిరా నీకు?! నువ్వు కొంపతీసే కొరివ్విరా బాబూ! అనుకున్నాన్నేను,

ఎందుకంటే ఓసారి, రావుగాడు వాళ్ళ ఆఫీసరు ఏవోలంచాలు పుచ్చుకుంటున్నాడని తెలిసి, పేర్లూ గట్రా మార్చి, ఆ ఆఫీసరుమీద కథ రాసీసేడు. ఆ తరవాత దాన్ని గురించి పెద్ద తగువైపోయింది. వాణ్ణి వుద్యోగంలోంచి తీసేస్తారేమోనని మేఁవంతా హడిలి చచ్చేం కూడాను. కాని, పాపం, ఆ ఆఫీసరెవడో మంచివాడు, వీడికి ప్రమోషను మాత్రం రాకుండాచేసి, మొత్తం మీద వుద్యోగం వూడిపోకుండాచేసేడు.

ఇంకోసారి రావుగాడు వాళ్ళదగ్గిర బంధువేనట, ఎవరో ఏదో వెధవపని చేసేట్ట. అందుగురించి వీడు ఆయన మీద ఓ కథ బరికేడు, దాంతో, ఆ బంధువు వీళ్ళింటికి రాకపోకలు మానుకున్నాడు.

నేనూ వాడిలాగే మా ఆఫీసర్లమీదా: బంధువులమీదా కథలు రాసేస్తే, నా బతుకూ వాడిలాగే అయిపోతే చూసి సంతోషిద్దామని వెధవ విషపు కోరిక!

నేనెందుకు రాస్తాను? రాయను. మనకి భగవంతుడు ఇచ్చిన ఈ శక్తిని— మనకి అయిన వాళ్ళమీదా, కావల్సిన వాళ్ళమీదా కథలు బరకడానికిటండీ?

ఇలాంటివాడితో వాదించి మాత్రం ప్రయోజనం ఏఁవుంది? అందుకే నేను ఇలాంటి వుడుకుమోతు వెధవల మాటల్ని కేర్ చెయ్యడం మానీసేను, కాని నక్షత్రకుడిలా వాడూరుకుంటాడా? నాదేదైనా రచన పడగానే మా ఇంటికివచ్చి మరీ నన్ను విమర్శిస్తాడు,

ఓసారి వాడికీ నాకూ 'అంకితాల'గురించి పెద్ద తగువయిపోయింది.

558

"అంకితం ఇస్తున్నానంటున్నావు: ఏఁవిఁటి దీనివల్ల నువ్వు సాధించేది? నానా చెత్తా చెదారం రాసీసి వెంకట్రఁవణమూర్తికి అంకితం యిచ్చేస్తావు. నోరులేని దేఁవుడు కాబట్టి సరిపోయిందికాని, అదే నోరున్నవాడైతేనా?....'నీ కంపుసాహిత్యాన్ని అంకితం పుచ్చుకుందికి నా ఖర్మేంకాలిపోలేదు పోపో?'అనుండును"అన్నాడురావుగాడు.

నాకు మా చెడ్డ కోపం వచ్చింది. వాడు నాస్తికుడు. అంచేత ఏవైఁనా వాగుతాడు. దానికో అర్థం పర్థం వుండదు. అసలు నేను పోటీలకి పంపించిన నవలల్ని వేంకటేశ్వర స్వామికి అంకిత మిస్తానని మొక్కుకున్నాను.అవును నేను ఆస్తికుణ్ని. నా నమ్మకాలు నావి. నాకు నవలల పోటీలో వచ్చిన డబ్బులో సగం తిరపతి హుండిలోనే వేసేను. అందుకే, ఆ స్వామికి అంకితం ఇచ్చేను. మరోసారి బాబా గారికి మొక్కుకుని నా నవలని పోటీకి పంపించేను దానికి బహుమతి వచ్చింది. మరి, దాన్ని బాబా గారికే అంకితం ఇచ్చేను. ఇవన్నీ రావుగాడికి తెలుసా? ఏదో నోటికొచ్చినట్టు పేల్తాడు అసలింకా చెప్పాలంటే, నేనో నవలని అనాదలకి దరిద్రులకి కూడ అంకితం ఇచ్చేను, వాడికి ఆ సంగతి తెలుసు కూడాను.

"ఒరే! 'అనాధలకి అంకితం'అన్నావు. అంటే ఏఁవిటి చేస్తావు? నీనవలకి పత్రికవాళ్ళిచ్చిన దాంట్లోగాని, పబ్లిషరు యిచ్చినదాంట్లోగాని ఒక్కపైసాఅయినా వాళ్ళ కోసం, ఖర్చుపెట్టేవా! ... అదెలాగాలేదు పోనీ ఆ 'అనాధలూ దరిద్రులూ' అలాగే ఎందుకున్నారో, వాళ్ల అలా వుండడానికి వెనకవున్న కారణాలేఁవిఁటో నీ నవల్లో ఒక్క ముక్కయినా చెప్పేవా?.... మరెందుకురా ఈ అంకితాలు?" అన్నాడు వుడుకు మోతు రావుగాడు.

బావుంది. ఇది మరీబావుంది. ఏదో సాఁవెఁత చెప్పినట్టు— కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీను!

రావుగాడికి మన రచయితలమీద ఇంకో అభిప్రాయంకూడా వుంది. మన రచయితలకి (అంటే రచయిత్రులకి కాదని కాదు, వాళ్ళకీను) చాలామందికి అసలీనాటి సమస్యలన్నింటికీ మూలకారణం— 'డబ్బు'అంటే ఇప్పుడున్న ఆర్థికవ్యవస్థ— అని తెలియనే తెలియదు అంటాడువాడు. రావుగాడు వుత్తి డబ్బుమనిషి. డబ్బుతోటే గౌరవం, హోదా, మంచీ, చెడూ అన్నీ వస్తాయంటాడు నేన్నమ్మను. మన పవిత్ర భారత దేశంలో డబ్బుకి అంత విలువ ఇచ్చేవాళ్లున్నారని నేను అనుకోను, పైదేశాల్లో అంటారా. వొప్పుకుంటాను వాళ్ళకిమనలాగా దేఁవుఁడూ, ధర్మచింతనా, స్త్రీధర్మాలూ, వివాహ వ్యవస్థా, మడీ, ఆచారం, నీతీ, నియమం— ఇవేవీ లేవుకదా!

మరోసంగతి చెప్పమంటారా? రావుగాడికి మన రచయిత్రులంటే మంట. వాళ్ళలో ఒక్కరికీ సరైన 'అవగాహన'లేదుట. ఏవేవో కల్పనాలోకాల్లో విహరించి, నేలకి నాలుగు కిలోమీటర్ల యెత్తునించి రాస్తారుట. ఇలా వాళ్ళమీద ఎన్నో 'విట్లు' వేస్తూనే వుంటాడు.

కాని నన్నడిగితే, ఇదికూడా అన్యాయమే అంటాను. అసలే మనదేశంలో స్త్రీ ఎంతో వెనుకబడివుంది. ఈనాడు ఇందరు రచయిత్రులు వస్తున్నారంటే మనం ఎంతో గర్వించవలసిన విషయం అని అనుకుంటూ వుంటాన్నేను. అంచేత, ఏదో రాస్తున్న వాళ్ళని పట్టుకుని— అవగాహనలేదు, అదిలేదు, ఇదిలేదు అని విమర్శించడం అన్యాయం. అసలింతకి రావుగాడి ఏడుపల్లా ఏఁవిఁటంటే— వాళ్ళు, గోటితోపోయే సమస్యలకి గొడ్డళ్ళతోనూ, మహాప్రళయం ముంచుకొస్తే తప్ప తీరని సమస్యలకి గోటితోనూ పరిష్కారాలని కాయితం మీద సాధించి పారేస్తున్నారని! సరే, వాళ్ల రాసిందీ పోనీ, 'హానిచేసే సాహిత్యమే' అనుకోండి. అయితే మాత్రం?.... ప్రజలు అభిమానిస్తున్నారా, లేదా? సాహిత్యం ఎవరికోసం? ప్రజలకోసమే కదా? అలాంటప్పుడు ప్రజలు అభిమానిస్తున్న సాహిత్యం 'చెత్త సాహిత్యం' ఎలా అవుతుందో నాకొక్కసారి చెప్పండి వింటాను.

ఇంకా గట్టిగా చెప్పాలంటే, మా రచనలు 'నాన్సెన్సు' అయినట్టయితే, సంపాదకులెందుకు వేస్తున్నారు? పాతికో పరకో ఎందుకిస్తున్నారు? జెలస్ వెధవ రావుగాడు ఇవేవీ ఆలోచించడు. ఎంతసేపూ నన్నేదో ఏకేద్దాఁవనే ధ్యాసేతప్ప, మరో ఆలోచనలేదు వాడికి. అసలు ఈ పదేళ్లలో వాడు ముప్పయ్యే రాయడమేం?.... ఎన్నో రాసుంటాడు. కాని తిరిగొచ్చేసుంటాయి. అందుకే ఆ ఏడుపు.

నాకు శరత్ బాబంటే ఇష్టం, అందువల్లే నేను అప్పుడప్పుడు బడదీదీ, దేవదాసులాంటి పాత్రల్నీ; పార్వతి, సావిత్రిలాంటి పాత్రల్నీ సృష్టిస్తూ వుంటాను, నాకు ఆ పాత్రలంటే ఎంతో అభిమానం. అంతేకాదు; ఎందరో పాఠకులు నన్నందుకు మెచ్చుకుంటూ వుత్తరాలు రాసేరుకూడాను. అందు గురించి కూడా రావుగాడికి నేనంటే జెలసీ.

ఇలా ఎన్నని చెప్పమంటారు మేష్టారూ? నేను నా కథల్లో అందమైనస్త్రీలని వర్ణిస్తూ వుంటాను. అదీ వాడికి పడదు. నా రచనల్లో 'సెంటిమెంటు'మీద విజయం సాధిస్తానని నన్నోసారి వెక్కిరించడానికి ప్రయత్నించేడు.

560

నాస్తికముండాకొడుకు వాడికి సెంటిమెంట్లేఁవిటి? ఏఁవీఁ వుండవు. అమ్మా నాన్నా, చెల్లీ, తమ్ముడూ, పెళ్లాం పిల్లలూ అన్ని సంబంధాలకీ మూలం ఆర్థికవ్యవస్థ; డబ్బు. డబ్బు, డబ్బే అనేవాడు— వీడికి సెంటిమెంటు ఒకటా!

ఓరోజు రావుగాడు— నేనింగ్లీషుకథలు కాపీకొట్టేస్తున్నానని నాదగ్గిరవీడ్చాడు.

నిజఁవేనండీ, కొన్ని చక్కని కథలూ, మనోహరమైన భావాలూ ఇతర భాషల్లో వుండిపోతే, మన తెలుగు పాఠకలోకానికి అవన్నీ ఎలా అందుతాయి? అందుకనే, నేను కొన్ని కథల్ని తెలుగులో రాయకపోలేదు. రాసేను. అయితే కొందరిలాగా సుబ్బరంగా కాపీకొట్టేసి, మళ్ళీ సొంత రచనల్లాగ పోజు కొట్టలేదే నేను? ఆఒరిజినల్ రచయితకే నా రచనని అంకితం ఇచ్చేస్తున్నానే? అయినా రావుగాడికి ఎందుకీ ఏడుపు?

సందర్భం వచ్చింది కాబట్టి చెప్తున్నాను: నేనురాసిన నవలల్లో— రాజనాల, ఎన్టీరామారావు, నాగేశ్వర్రావు, జమున, గుమ్మడి వుండి తీరతారని, పెద్దకనిపెట్టిన వాళ్లా. నాతో చెప్పేడు రావుగాడోసారి.

అవును. నేను నవల రాసినప్పుడే పాత్రలస్వరూప స్వభావాల్ని వూహించుకుంటాను. నా నవలని సినీమాగా తీస్తే ఎలా వుంటుందో అనుకునే రాస్తాను. ఏం, తప్పా?

ఇలా చెప్పుకుంటూ పోతే, తెల్లవారి పోతుంది. నాకు సాహిత్య ఎకాడమీ బహుమతి వచ్చిందని రావుగాడికి ఏడుపు. ఆ బహుమతి కోసం నేను ఎన్నిపాట్లు పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు. ఈ రావుగాడికేం తెలుసు?.... నన్ను వెక్కిరించడం తప్ప!

మరో సంగతి. నా గొప్ప చెప్పుకోఁటం కాదుకానీ. నేను నా కథల్లో మంచి మంచి ఆదర్శాలూ, త్యాగాలూ వీటి గురించి ఎక్కువగా రాస్తూ వుంటాను. ఒకవేళ వాస్తవ జీవితంలో అది వేరే అనుకోండి. పోనీ. నా కథలు చదివేకైనా వున్న మనుషులు మంచికి మారొచ్చును కదా! వుదాహరణకి, నాకు మొన్న ప్రయిజొచ్చిన కథలో చూడఁడి ఆ కోటీశ్వరుడు, తన కన్నకొడుకు కమ్యూనిష్టయి పోయేడని ఆవేదనో తన ఆస్తంతా పేద ప్రజానీకానికి పంచి పెట్టేస్తాడు. ఇలాంటి మహోన్నత త్యాగ బుద్ధిని గురించి నేను రాస్తే, రావుగాడు.— వీడి నోరు పడిపోను—వెర్రెత్తి పోయి ఏఁవన్నాడో తెలుసునా, "ఒరే, బాబు! గుడ్డి కళ్ళు పెట్టుకొని నిజం నీకు కనబడక పోతె పోయింది కాని, అబద్దాలు మాత్రం రాయకురా, నా తండ్రి!" అంటూ ఏడిచేడు.

561

ఇంతదాకా చెప్పేనుగనక మరొక్కమాట ... నేను చెప్పకుంటే ఎలావుంటుందంటే, "చూసేవా, వింటున్నాం కదాని వీడు సొంతడబ్బా కొట్టేసుకుంటున్నాడు"— అనేస్తారు. కాని నిజం చెప్పాలంటే నాది మొదట్నించీ గొప్ప జాలిగుండె. 'నీ రచనల్లో ప్రధానరసం ఏది?'అనిగాని ఎవరైనా నన్ను ప్రశ్నిస్తే 'కరుణరసం'అని తడుముకోకుండా చెప్పేస్తానన్నమాట, అసలు 'కరుణశ్రీ'అని పెన్‌నేమ్‌లో రచనలు చేద్దామని కొన్నాళ్ళకిందట అనుకున్నాన్నేను. ఆ పేరుతో ఎవరో కవి వున్నారని రావుగాడే నాకు చెప్పేడు.

ఇంతకీ చెప్పేదేమిటంటే, ఈ మధ్య నేనొకకథరాసేను. నేనిన్నాళ్ళూరాసిన కథలన్నీ ఒకెత్తూ, అదొక్కటీ ఒకెత్తూ అనిపిస్తోందినాకు. ఎందుకంటే, ఆ కథకి ఆ పత్రికవాళ్ళు బ్రహ్మాండమైన పబ్లిసిటీ ఇచ్చి వేసేరు. ఆ సబ్జెక్టుమీద మరికొన్ని కథలు రాయమనికూడా నన్ను రిక్వెస్టు చేసేరు.

ఆ కథలో సబ్జెక్టేమిటంటె. మీకు తెలుసుకదా, మేష్టారూ! ఈ రోజుల్లో న్యూసుపేపరు తెరిచ్చూద్దామంటేనే భయం వేసిపోతోంది. అదేదో రాజ్యం స్థాపించదంకోసమని. అక్కడెక్కడో తలకాయలు తెగనరుకుతున్నారటకదా! ఈ మాట పేపర్లో చదివితేనే చాలు నాకు కళ్ళంట నీరు తిరిగిపోయి. అన్నంకూడా సాయించడంలేదు. ఓరాత్రిప్పుడు నిద్రలో తెలివొచ్చి, అదంతా తల్చుకుంటే తలగడా తడిసిపోతోందన్నమాట.

నేను ఆ సబ్జక్టునే తీసుకుని ఆ కథరాసేను. మీకు చెప్తే నమ్మరుకాని, గురువుగారూ, ఆకథని ఓచేత్తో రాస్తూ, మరోచేత్తో కళ్ళు తుడుచుకుంటూనేవున్నాను. కథ పూర్తయేక మళ్ళీ ఫెయిర్ కాపీరాయడానికికూడా నాకు మనసంతా అదోలా అయిపోయింది. మా ఆవిడే, పాపం, ఫెయిర్ చేసిందిలెండి. దాన్దీ నాలాగే జాలిగుండె. అది రాస్తున్నంతసేపూ, గుండె చెరువయిపోయిందని చెప్పిందికూడాను.

సరే, ఇంత దీన్తో మనం రాస్తే, పత్రికలవాళ్లు సరేసరి; పాఠకులుకూడా వుత్తరాలమీద వుత్తరాలు కుప్పించేరు. మనవాడేకదా, పోనీ నేను అనడం కాదు, ఇందరు 'మంచి కథ' అంటున్నారుకదా అని చెప్పి, రావుగాడికి ఆ కథని తీసికెళ్ళి చూపించేను.

వాడు అంతా చదివి, కన్నింతా ముక్కింతా చేసేసుకుని, వూపిరి గట్టిగా పీల్చుసుకుని, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ—

562

"రామాయణం ఎవ్రరాసేర్రా?" అన్నాడు.

వెధవ జోకు. "వాల్మీకి రాసేడ"న్నానేన్నేను.

"నువ్వు గొప్పా? వాల్మీకి గొప్పా" అన్నాడు వాడు.

వాల్మీకి ముందునేనెంత? ఏనుగుముందు ఎలక పిల్లని. "వాల్మీకి గొప్ప" అన్నాను.

"అయితే విను." అంటూ మొదలెట్టేడు. "ఆ వాల్మీకిదీ నీలాగే గొప్ప జాలి గుండే. చూడు కావాలంటే రామాయణం మొదలుపెడుతూనే అక్రౌంచ మిధునానికి జరిగిన అన్యాయానికి ఆయన గుండె కరిగిపోయింది. కాని నీలాగ బాల్చీలకొద్దీ కన్నీళ్లు కారుస్తూ కూచోలేదు. 'అయ్యో! అయ్యో!!' అంటూ వెధవ కథలు రాయలేదు. ఏ పాపం ఎరగని ఆ పక్షుల జంటకి వాటిల్లిన కష్టానికి కారణమైన వాణ్ని పట్టుకు తిట్టేడు. శపించేడు. బోధపడిందా? అదీ ఆయన చేసింది— మరింకపోతే నీ రెండో పాయింటు - తలకాయలు తెగనరకడం. రావణాసురుడి తలకాయలు రాముడు ఎన్నిరా నరికేడు? ఒకటికాదే! రెండుకాదే! పదిరా బాబూ, పది. మరా పదీ నరికితే వాడు చచ్చేడా? మళ్ళీ మరో పది తలకాయలు మొలిచేయి. మళ్ళ ఆ పదీ నరికేడు. మళ్లి మొలిచేయి. మళ్లి నరికేడు.... వాల్మీకి ఇదంతా విని, నీలాగ 'అయ్యో! తలకాయలే! నరికీడ(వే!? రక్త(వే?!' అంటూ గోల గోల చేసేసి, గగ్గోలు పెట్టేలేదే? మరైతే, ఏంచేసేడు?.... అధర్మాన్ని పడగొట్టి, ధర్మాన్ని నిలబెట్టడానికి రాముడంతటి వాడు కూడా తలకాయలు తెగనరకడానికైనా వెనుదియ్యడు సుమా అని చెప్పేడు. ఆ ముక్క చెప్పడానికే అంత రామాయణ(వూ రాసేడు. అంచేత అప్పుడు వాల్మీకికయినా, ఇప్పుడు నువ్వయినా మరోడయినా చెప్పవలసిందది. అంతేకాని వెధవ జాలి కథలు రాసుకుని జనాన్ని తప్పుదార్లు పట్టించడంకాదు........ అయినా, జనం కన్నీళ్లని కేష్ చేసుకునీ వెధవ్వి నీకు ఎంత చెప్తేమాత్రం లాభం ఏ(వి(టి?" అనీసి చంచరా వెళ్ళిపోయేడు రావుగాడు.... చూడండి వెధవ వాదన! జనం కన్నీళ్లు కారుస్తూకూడా నా రచనల్ని మెచ్చుకుంటూవుంటే వీడొక్కడే జనాన్ని తప్పుదారి పట్టిస్తున్నావో అని గోల పెట్టేస్తాడు! వాడలా వెళ్లిపోడంతో నేను అవాక్కయిపోయి, అలా వున్నచోటే నించుండి పోయేను.

ఇంతలోనే మళ్ళీ. ఏవో కొంపలు మునిగిపోతున్నవాళ్లా వచ్చి. "ఒరే! ఇప్పుడు కాకపోయినా, మరోనాటికైనా పాఠకులు వాళ్ళకి నిజంగా కావలసిన సాహిత్యం

563

ఏదో తెలుసుకుంటారురా! అప్పుడు మీ రచనలు పొయ్యిచేసుకుందికీ, గంజివార్చు కుందికీ కూడా వుపయోగించరు. తెలిసిందా?.... ఈలోపుని ఆపత్రిక వెధవ ఇలాంటివే మరోనాలుగు కథలు రాయమన్నాడని చెప్పి నువ్వురాసేస్తే, అవన్నీ కలిపి ఓ పుస్తకం వేసేస్తే, సాహిత్య ఎకాడమీ వాళ్లు నిన్ను మళ్ళీపిలచి, మరో స్పెషల్ బహుమతి యిస్తారు. పో! పోయి, తెచ్చుకో!" అనేసి మళ్ళీ వెళ్ళిపోయేడు. వాడికి నామీద అంత మంటవుంది. మొండివాళ్ళతో మనకి వాదనేఁవిఁటి చెప్పండి? మెరిట్‌ని ఎప్రీషియేట్ చెయ్యలేని సినికల్ రాస్కెల్.

వీడు 'జనం జనం' అంటూ ఏ వెధవపని చేసేస్తాడోననినాకు పక్కబెదురు వుంటూనే వుంది. సరిగ్గా అనుకున్నట్టే ఆదేదో విప్లవ రచయితల సంఘంట, దాన్లో చేరిపోయేడు రావుగాడు ఈమధ్యనే. మాజీ సాయెబు వుండుండి తురకల్లో కలిసిపోయేడని.... బా-గానేవుంది. కాని యిప్పుడు వాణ్ని కలవడానికే నాకు భయం వేస్తోంది. ఏదో నాలుగు కాలాలపాటు బతికి, నాలుగు నవల్లు రాసుకుందామనుకుంటున్నవాణ్ణి.... నిన్న వాడు రోడ్డుమీద కనిపిస్తే, మరోదారంట వెళ్ళిపోయేన్నేను.

....ఇంత చెప్పేక నాదొక చిన్న మనవి. ఈ రావుగాడూ, వీడిలాంటి వాళ్లు బయల్దేరి, 'జనం, తప్పుదారి పట్టించడం' అంటూ ఏవో అర్థంపర్థంలేని మాటల్తో నామీదా, నాలాంటి వాళ్ళమీదా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిసింది. నాకుతెలుసు. నా పాఠకుల మీద నాకు నమ్మకంవుంది. ఈ రావుగాడు కాదు వాడిలాంటి వాళ్ళు వంద మంది వచ్చినా నా పాఠకులు నన్నే అభిమానిస్తారు.... తమరుకూడా గిట్టనివాళ్ళ ప్రచారానికి లోపడి పోవద్దని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. ఇక శలవా?

---

వెలువడుతున్నది

పైగంబరకవుల రెండవ కవితాసంకలనం

# యుగ చైతన్యం

ప్రతులకు, ఇతర వివరాలకు :

ఆర్. కిరణ్‌బాబు

2/18, బ్రాడిపేట, గుంటూరు-2.